### తిరుపతి జిల్లాలో నాకాబంది

**తిరుపతి క్రైం:** జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు శనివారం తిరుపతి జిల్లాలోని ప్రతిచోటా నాకాబంది చేపట్టారు. అసాంఘిక సంఘటనలకు ఆస్కారం లేకుండా నిరోధించడానికి, మాదక ద్రవ్యాలు నిర్మూలన కోసం నాకాబంది నిర్వహించినట్లు సమాచారం. జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి స్వయంగా తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రధాన రోడ్లలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.













**A.SANATH KUMAR (BUILDER) & A.S. DIKSHITHULU వారిపై**
**పత్రికా ప్రకటన**

మా కక్షిదారులైన 1) పి.ఆర్.గోపీనాథ్, 2) పి. చొక్కలింగం, 3) పి.జనార్ధన్ కుమార్, 4) జి.విజయ, 5) వి. గురుప్రసాద్‌ల మేరకు

ఎ.సనత్ కుమార్ (బిల్డర్) ఎ.ఎస్.దీక్షితులు వార్లపై తేది 15-04-2008 విక్రయ అగ్రిమెంట్ మేరకు తిరుపతి 5వ అడిషనల్ జిల్లా జడ్జి కోర్టులో O.S.No.113/2011 దాఖలు పరచి తేది 05-07-2019 డిక్రీ పొంది ఉన్నారు. ఆ డిక్రీ మేరకు ఎ. సనత్ కుమార్ మరియు ఎ.ఎస్.దీక్షితులు అమలు చేయకుండా గౌ॥ హైకోర్టు అమరావతిలో A.S.No.316/2021 దాఖలు పరచి కండీషనల్ ఆర్డర్ పొందియున్నారు.

మా కక్షిదారులు హై కోర్టు ద్వారా క్రాస్ అబ్జెక్షన్స్ మరియు మధ్యంతర ఉత్తర్వులు పొందగోరుచున్నారు. తేది 21-08-2023 RCNo. E2/924/2023 జిల్లా కలెక్టరు తిరుపతి వారి ఉత్తర్వుల మేరకు షెడ్యూలు దాఖలా భూమి Prohibited Properties List U/S 22A నుండి తొలగించబడినందున సదరు ఎ. సనత్‌కుమార్ (బిల్డర్), ఎ.ఎస్.దీక్షితులు షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు విషయాలను కప్పిపుచ్చి ఇతరులకు అమ్మడానికి ప్రయత్నించుచున్నాడు.

కావున అట్టి క్రయ విక్రయాలు ఎంతమాత్రం చెల్లనేరవు. వాస్తవాలను కప్పిపుచ్చి మోసపూరితమైన క్రయ విక్రయాలపై మా కక్షిదారులు తీసుకును సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని హెచ్చరించడమైనది.

**SCHEDULE:** Tirupati District Sri Balaji Registration District Tirupati, Sub District No.29, Tirupati Village Accounts. S.No.479/1. Tirupati municipal ward No.18 Khadi Colony, Prasanthi Nagar residential Ac. 0-70 cents

ఇట్లు : మట్టా పురుషోత్తం రెడ్డి, న్యాయవాది, తిరుపతి







# అన్ని విధాలా ముంగిళిపట్టు అభివృద్ధి

- రూ.47 లక్షలతో ఆసుపత్రి, మహిళా భవన నిర్మాణానికి శంకుస్థాపన
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**చంద్రగిరి:** మండలంలోని ముంగిలిపట్టు పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక సర్పంచ్ భారతితో కలిసి రూ.47 లక్షలతో ఆస్పత్రి, మహిళా భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా మంచి పనికి అడ్డంకులు ఎదురవుతూ ఉంటాయన్నారు. వాటిని అధిగమించి ఆస్పత్రిని నిర్మించి ప్రజలకు అంకితం చేస్తామని భరోసా ఇచ్చారు. గతంలో ప్రతిపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని, ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని వెల్లడించారు. ఎన్నికల్లో మాత్రమే రాజకీయం చేయాలని, తర్వాత ప్రజల కోసం పనిచేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. ఆయన సూచనలకు అనుగుణంగా నడుచుకుంటామన్నారు. అనంతరం గ్రామ ప్రజలు మోహిత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లోకయ్య నాయుడు, ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షులు దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, నాయకులు దామోదర నాయుడు, పరంధామ నాయుడు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

### సమస్యలు పరిష్కరించాలని వినతి

**తిరుపతి కల్చరల్:** సమస్యలు పరిష్కరించాలని ఎండీయూ ఆపరేటర్లు కోరారు. వారు శనివారం తిరుపతికి విచ్చేసిన పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరావుకు వినతి పత్రం అందజేశారు. ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 554 మంది ఎండీయూల ఇన్సూరెన్స్ సొమ్ము ఇప్పించాలన్నారు. ప్రమాదంలో మరణించిన 62 మంది ఆపరేటర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ నెలాఖరులోపు సమస్యలు పరిష్కరిస్తామని వారికి మంత్రి భరోసా ఇచ్చారు.

### లోక్ అదాలత్‌లో 4,608 కేసుల పరిష్కారం

**తిరుపతి లీగల్:** తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 4,608 కేసులు పరిష్కారం అయినట్టు తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం ఏడు బెంచులను ఏర్పాటు చేసినట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆ బెంచ్లకు అధ్యక్షులుగా తనతో పాటు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి విజయసారధి రాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, జూనియర్ సివిల్ జడ్జిలు కోటేశ్వరరావు, సంధ్యారాణి, గ్రంధి శ్రీనివాస్, వై.సరిత వ్యవహరించారన్నారు.

### 4.5 కోట్ల కేసు పరిష్కారం

లోక్ అదాలత్‌లో రూ.4.50 కోట్ల విలువ చేసే కేసు పరిష్కారం కావడం విశేషం. తిరుపతికి చెందిన ముగ్గురు వ్యక్తులపై శ్రీరామ్ సిటీ యూనియన్ కోర్టులో ఎగ్జిక్యూషన్ పిటిషన్ దాఖలు చేసింది. శనివారం లోక్ అదాలత్‌లో జడ్జి గురునాథ్, న్యాయవాదులు వారితో చర్చించి కేసును పరిష్కరించారు.










### మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన మంత్రి కనుమూరి



**తిరుపతి మంగళం:** తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర సివిల్ సప్లయీస్ శాఖ మంత్రి కనుమూరి నాగేశ్వరరావు శనివారం తిరుపతి మారుతీనగర్‌లోని మంత్రి నివాసంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట శ్రీకాళహస్తి ఎమ్మె ల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, టీటీడీ మాజీ పాలక మండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ ఉన్నారు.

### కరాటే పోటీల్లో పతకాలు

**తిరుపతి ఎడ్యుకేషన్:** తిరుపతి కేశవాయనిగుంటలోని రత్నం పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని వి.వెన్నెల రాయల్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించింది. ఈ నెల 2, 3 తేదీల్లో విశాఖలో నిర్వహించిన జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వెన్నెల పాల్గొంది. కట, ఫైట్ విభాగాల్లో తలపడి బంగారు, వెండి పతకాలు సాధించింది. విద్యార్థిని, కరాటే కోచ్ సింహాచలంను ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రవి అభినందించారు.


విద్యార్థిని, కోచ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవి తదితరులు

### కళా సంపదను భావితరాలకు అందించాలి

**తిరుపతి కల్చరల్:** తిరుపతి కల్చరల్: భారతీయ, సంస్కృతి, సంప్రదాయ కళా సంపదను పరిరక్షిస్తూ భావితరాలకు అందించాలని మేయర్ శిరీష, టీటీడీ మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. మహతి కళాక్షేత్రంలో శనివారం చేపట్టిన జాతీయ స్థాయి సంగీత, సాహిత్య, నృత్యోత్సవాల్లో వారు పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

### భక్తిభావాన్ని పంచిన అయోధ్య కాండ అఖండ పారాయణం

**తిరుమల:** ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై శనివారం ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు 3వ విడత అయోధ్య కాండ అఖండ పారాయణం భక్తజనరంజకంగా సాగింది. ఇందులో 9 నుంచి 11వ సర్గల వరకు గల 139 శ్లోకాలను పారాయణం చేశారు. యోగవాసిష్టం - ధన్వంతరి మహామంత్రం 25 శ్లోకాలు పారాయణం చేశారు. ధర్మగిరికి చెందిన ప్రఖ్యాత పండితులు రామానుజాచార్యులు, అనంత వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### పేరూరు జర్నలిస్ట్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ

**తిరుపతి రూరల్:** పేరూరు జర్నలిస్ట్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అమలుచేస్తామని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి లక్ష్మి తెలిపారు. ఆమె శనివారం జర్నలిస్ట్ కాలనీలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు.

### వేడుకగా సామూహిక వరలక్ష్మీ వ్రతం

**తిరుపతి కల్చరల్:** శ్రావణ మాసం సందర్భంగా తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో శనివారం వేడుకగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఇందులో సుమారు 70 మంది మహిళలు పాల్గొన్నారు.

### రెండో ఘాట్ రోడ్డులో ప్రమాదం

**తిరుమల:** తిరుపతి నుంచి తిరుమల వెళ్లే రెండో ఘాట్ రోడ్డులో శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తమిళనాడు నుంచి శ్రీవారి దర్శనానికి కారులో వెళ్తున్న భక్తులు లింక్ రోడ్డు వద్ద వేగంగా వెళ్లి పిట్టగోడను ఢీకొన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

### నెరవేరిన 20 ఏళ్ల నాటి కల

**చంద్రగిరి:** తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతో నరసింగాపురం పంచాయతీ హరిజనవాడలో అధికారులు విద్యుత్ లైన్లు వేస్తున్నారు. ఈ గ్రామంలో 40 ఇళ్లకు విద్యుత్ లైన్లు లేకపోవడంతో పక్క వీధి నుంచి వైర్ల ద్వారా విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. గాలి, వాన వచ్చినప్పుడు వైర్లు తెగిపోయి 20 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దళితవాడలో పర్యటించారు. దళితుల సమస్య లను ఎంపీటీసీ అశ్విని, ఆమె భర్త ప్రవీణ్ కుమార్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో శనివారం అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు లాగారు.

### ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

**భాకరాపేట:** చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ మారసానివారిపల్లె వద్ద శుక్రవారం రాత్రి దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. గత నెల 22న మారసానివారిపల్లె, కురవపల్లె కురవపల్లె వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టారు. ట్రాన్స్‌కో ఏఈ రెడ్డిప్రదీప్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ

**తిరుపతి రూరల్/పాకాల/రామచంద్రాపురం/తిరుపతి మంగళం:** తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన నవీన్‌కుమార్, దుర్గాదేవి, పాకాల మండలం పంటపల్లికి చెందిన గిరిప్రసాద్‌రెడ్డి, భావనరెడ్డి, దామలచెరువు పంచాయతీ కొమ్మేపల్లికి చెందిన ప్రవీణ్, సుప్రియ, రామచంద్రాపురం మండలం కొత్తనెన్నూరుకు చెందిన ఫైరోజ్, తిరుపతి మంగళం సప్తగిరినగర్ పంచాయతీ సప్తగిరికాలనీకి చెందిన శ్రీఅభినయకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు.

### అవగాహనతో మానసిక సమస్యలకు చెక్

**తిరుపతి తుడా:** మానసిక సమస్యలను అవగాహనతో అధిగమించవచ్చని రుయా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాహ్నవి తెలిపారు. రుయా ఆస్పత్రిలో శనివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సే నోటు సూసైడ్ డోంట్ కిల్ యువర్ సెల్ఫ్ అన్న నినాదంతో ర్యాలీ చేపట్టారు. డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ తిరుపతి రుయాలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైకియాట్రి విభాగం మానసిక సమస్యలకు పరిష్కారవంతమైన చికిత్స అందిస్తోందన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన డీఆర్వో

**తిరుపతి అర్బన్:** బాధ్యతలు చేపట్టిన డీఆర్వో పెంచలకిషోర్ శనివారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయన రెండు రోజుల క్రితం తిరుపతి డీఆర్వోగా నియమితులయ్యారు.










